క్లుప్తంగా

వైద్యసేవలు అందించాలి

మణుగూరురూరల్: మండల పరిధిలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్)లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వైద్యసేవలు అందించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూధన్‌రెడ్డి యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు శనివారం బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. వైద్యసేవలు అందించడంలో యాజమాన్యం వివక్ష చూపడం సరికాదన్నారు. సీఈ సానుకూలంగా స్పందిస్తూ.. ప్రస్తుతం బీటీపీఎస్‌లో ప్రాథమిక చికిత్సలు మాత్రమే అందిస్తున్నట్లు తెలిపారు. బీటీపీఎస్‌లో హాస్పిటల్ నిర్మాణం జరిగితే పర్మినెంట్ ఉద్యోగస్తులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు, ప్రజలకు కూడా వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొన్నారు.

ఏసీలు వితరణ

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లోని సద్గురు సాయినాథుని అన్నదాన సత్రంలో భక్తుల సౌకర్యార్థం పట్టణానికి చెందిన శ్రీశ్రీలక్ష్మీ శ్రీనివాస జ్యుయలరీ షాప్ యజమాని దుగ్గి సతీష్‌కుమార్–నీలిమ దంపతులు రూ.లక్షా 59 వేల విలువ చేసే మూడు ఏసీలను శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పవన్‌కుమార్ శర్మ, ఆలయ గుమస్తా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయానికి..

అశ్వాపురం: మండల పరిధిలోని సంద్రలబోడు గ్రామ పంచాయతీ పరిధిలోని బండ్లసిరిగుట్ట శ్రీదేవి భూదేవి సమేత అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్వంచ వాస్తవ్యులు ఐతంరాజుల శివప్రసాద్, స్వాతి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అశ్వాపురానికి చెందిన వ్యాపారి సర్వేశ్వరరావు ఆలయానికి ఏసీ వితరణగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దేవుడమ్మ, ఆలయ కమిటీ సభ్యులు తెల్లం నాగరాజు, నెట్టెం రాధాకృష్ణ, గాదె కేశవరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల నివాళి

ములకలపల్లి: మండలంలోని ఒడ్డుగూడెంలో శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుతో మృతి చెందిన బోడా శివరామ్ కుటుంబాన్ని అధికారులు శనివారం పరామర్శించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఏఓ బాబూరావు ఒడ్డుగూడెంలోని శివరామ్ మృతదేహం వద్ద నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఏడీఏ లాల్‌చంద్, ఎంఏఓ కరుణామయి, ఏఈఓ పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది..

పిడుగుపాటుకు గురై మృతి చెందిన రైతు బోడా శివరామ్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి హామీ ఇచ్చారు. శనివారం ఒడ్డురామవరం గ్రామంలోని మృతుడి స్వగృహానికి వెళ్లి, శివరామ్ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కరుటూరి కృష్ణ, మాజీ సర్పంచ్ కారం సుధీర్, అమర్ సింగ్, పాలకుర్తి సుమిత్, బత్తుల రాము, దేవేందర్, వేము రోశయ్య తదితరులు ఉన్నారు.

లారీని ఢీకొట్టిన టిప్పర్

బూర్గంపాడు: పాల్వంచ నుంచి లక్ష్మీపురం వైపు వస్తున్న కర్ర లారీని అదే మార్గంలో వెళ్తున్న టిప్పర్ వెనక నుంచి ఢీకొట్టింది. మోరంపల్లి బంజర వద్ద శనివారం జరిగిన ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అయితే, ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

భద్రాచలంటౌన్: పట్టణంలోని సరోజిని అనాథలు, వృద్ధాశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ వైద్యుడు శ్రీధర్ వర్మ జ్ఞాపకార్థం ఆయన స్నేహితులు ఆశ్రమంలోని వృద్ధులు, అనాథలకు అన్నదానంతో పాటు దుస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ వైద్యులు రవికుమార్, అజిత్ రెడ్డి, పవన్‌కుమార్, సురేష్‌కుమార్, రమేష్ చంద్ర, శివరామకృష్ణ, ఆశ్రమ నిర్వాహకురాలు సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నిరసన

మణుగూరుటౌన్: ఎండ తీవ్రత నేపథ్యంలో డ్యూటీ టైమింగ్స్ మార్చాలని కోరుతూ మణుగూరు ఏరియాలోని ఓసీ–2, ఓసీ–4, కేసీహెచ్‌పీ, మణుగూరు ఓసీల్లో ఏఐటీయూసీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ మాట్లాడారు. ఆవుల నాగరాజు, పిట్ సెక్రటరీలు గెంపెన శ్రీనివాసరావు, కోడిరెక్కల శ్రీనివాసరావు,సాయిప్రకాశ్ చారి, మిట్టపల్లి వెంకటేశ్వర్లు, బివి సత్యనారాయణ, ఉడుత శివ, సందీప్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

దమ్మపేట: మండలంలోని నాచారం గ్రామంలో పలు పార్టీలకు చెందిన నాయకులు శనివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో కొత్త, పాత విభేధాలు పక్కనబెట్టి ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

గురుకులాల్లో విజయకేతనం

- వందశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు
- ప్రైవేటుకు దీటుగా ర్యాంకులు కైవసం
- ఫలిస్తున్న ప్రభుత్వ కార్యాచరణ



నాలుగో సారి వందశాతం ఫలితాలు సాధించిన మైనారిటీ గురుకుల పాఠశాల ఇదే..

అశ్వారావుపేటరూరల్/ములకలపల్లి: పదో తరగతి ఫలితాల్లో గురుకులాలు శతశాతం లక్ష్యాన్ని సాధించి సత్తా చాటాయి. దాంతో గురుకులాల్లో జోష్ నెలకొంది.

నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట మండలంలో మూడు గురుకుల పాఠశాలలతోపాటు మరో ఆరు ఐటీడీఏ గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో అశ్వారావుపేట మండల కేంద్రం ఒక మైనారిటీ గురుకుల పాఠశాలతోపాటు బీసీ బాలుర, బీసీ బాలికల గురుకులాలు ఉన్నాయి. కాగా మైనారిటీ గురుకుల పాఠశాల నుంచి 39 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాయగా 39 మంది ఉత్తీర్ణత పొందారు. బీసీ బాలికల గురుకుల పాఠశాల నుంచి 56 మందికి 56 మంది, బీసీ బాలుర గురుకుల పాఠశాల నుంచి 44 మందికి 44 మంది ఉత్తీర్ణత సాధించడంతో ఈ మూడు గురుకులాల్లో శత శాతం ఫలితాలు నమోదయ్యాయి. వీటిలో మైనారిటీ గురుకుల పాఠశాలలో శత శాతం నమోదు కావడం ఇదీ నాలుగోసారి కావడం విశేషం.

ఐటీడీఏ గిరిజన ఆశ్రమాల్లో అంతంతే..

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఐటీడీఏ గిరిజన ఆశ్రమ పాఠశాల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఆశ్రమాల్లో శత శాతం సాధించేలా లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ దానిని చేరుకోలేకపోయారు. అశ్వారావుపేట మండలంలో మొత్తం ఆరు ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలు ఉండగా వీటిలో మండల కేంద్రంలోని అటెండర్స్ కాలనీలో ఉన్న ఆశ్రమ పాఠశాల నుంచి కేవలం 12 మంది విద్యార్థులు ఉండగా వీరిలో 9 మంది మాత్రమే ఉత్తీర్ణులై 75శాతం ఫలితాలు నమోదు అయ్యాయి. అదే విధంగా మండలంలోని కావడిగుండ్ల గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో 12మందికి 11 మంది ఉత్తీర్ణత సాధించగా 91.67శాతం, సున్నంబట్టి గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో 24 మందికి 23 మంది ఉత్తీర్ణత కాగా 95.83శాతం, అనంతారం గ్రామంలోని ఆశ్రమ పాఠశాల నుంచి 39మందికి 36 మంది ఉత్తీర్ణులు కాగా 92.31 శాతం, పెదవాగు ప్రాజెక్టు ఆశ్రమ పాఠశాల నుంచి 22మందికి 20 మంది ఉత్తీర్ణత సాధించగా 90.91 శాతం ఫలితాలే నమోదు అయ్యాయి. గిరిజన ఆశ్రమాల్లో ఫలితాల సాధనలో వెనుబడటంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఐటీడీఏ ఉన్నతాధికారుల్లో అసంతృప్తి నెలకొంది.

అయితే మండలంలోని భీమునిగూడెం గ్రామంలోని ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో మాత్రమే వందశాతం ఫలితాలు నమోదు చేసుదయ్యాయి. ఇదే ఆశ్రమ పాఠశాలకు చెందిన కె.జ్యోతి చందు అనే విద్యార్థిని ఏకంగా 10కి 10జీపీఏ సాధించడం విశేషం.

ములకలపల్లి మండలంలో..

మండల కేంద్రంలోని గురుకుల బాలికల విద్యాలయం (టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్(జీ)) విద్యార్థులు ఇంటర్, టెన్త్ ఫలితాల్లో చక్కటి ప్రతిభ చూపారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. వందశాతం ఫలితాలతో గురుకులాన్ని ప్రైవేటు కళాశాలలకు దీటుగా నిలుపుతున్నారు. ములకలపల్లి మండల టాపర్లు కూడా ఇదే స్కూల్ కైవసం చేసుకోవడం గమనార్హం.

ఈ ఏడాది పాఠశాలకు చెందిన 79 మంది విద్యార్థినులు పదోతరగతి పరీక్షలకు హాజరుకాగా, అందరూ పాసయ్యారు. ఇక్కడ విద్యనభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థినులు సీహెచ్.గౌతమి, కే.యశ్విత 9.3 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. ఇంటర్మీయట్ ఫలితాల్లోనూ ఇదేహవా కొనసాగించారు. ద్వితీయ సంవత్సరంలో 63 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 63మందీ ఉత్తీర్ణత పొందారు. దీంతో ఇంటర్‌లోనూ శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎంపీసీ గ్రూపులో బత్తుల లక్ష్మీప్రసన్న 968/1000, బైపీసీలో కొత్తపల్లి మల్లిక 968/1000 మార్కులతో మండల ప్రథమస్థానం దక్కించుకున్నారు. బైపీసీకి చెందిన పునుగుపాటి మనస్విని 959, నారెడ్ల తేజస్విని 950మార్కులు సాధించారు. ఎంపీసీలో డేరంగుల చాందిని 950 మార్కులు సాధించింది. చక్కటి శిక్షణ, నిరంతర పర్యవేక్షణతో మంచి ఫలితాలు సాధిస్తున్న గురుకులం స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది.

పక్కా ప్రణాళికతో..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పక్కా ప్రణాళికతో పాఠ్యాంశాలు బోధిస్తున్నాం. ప్రతీ విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సమష్టి కృషితో వందశాతం ఉత్తీర్ణత సాధించగలుగుతున్నాం.

– సునీత, ప్రిన్సిపాల్, ములకలపల్లి బాలికల గురుకులం

‘పేట’లో పెరిగిన ఓటర్లు

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను శనివారం విడుదల చేశారు. తాజా ఓటర్ల జాబితా ప్రకారం అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, చంద్రుగొండ మండలాలు మొత్తం కలిపి 1,59,174 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 77,381 మంది, మహిళలు 81,786, ఇతరులు 7గురు చొప్పున ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కంటే తాజా తుది జాబితా ప్రకారం 3,213 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో పురుషులు 1,188 మంది, మహిళలు 2,025 మంది ఉన్నారు. పెరిగిన ఓటర్లతో నియోజకవర్గంలో అత్యధికంగా మహిళా ఓటర్లే ఉన్నారు. ఇక మండల వారీగా చూస్తే.. అశ్వారావుపేటలోనే అత్యధిక ఓటర్లు ఉండగా, అత్యల్పంగా అన్నపురెడ్డిపల్లి మండలంలో ఉన్నారు.



అశ్వారావుపేట రింగ్ రోడ్ సెంటర్..

గెలిపించే బాధ్యత మీదే..

చంద్రుగొండ: సమయాభావం కారణంగా తాను ఈ ప్రాంతానికి ప్రచారానికి రాలేకపోతానేమోనని, తన పాత్ర వహించి గెలిపించే బాధ్యత మీదేనని పార్టీ శ్రేణులతో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి శనివారం సాయంత్రం వచ్చిన ఆయన కొద్దిసేపు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఈ దిశగా కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన మైనారిటీ పేద మహిళలు రఘురాంరెడ్డితో మాట్లాడుతూ.. తమకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఆయన.. ఎన్నికల అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి యశ్వంత్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, ఎస్డీ సైదా, దరావత్ రామారావు పాల్గొన్నారు.

బీజేపీతోనే సువర్ణ పాలన



కరకగూడెం: బూత్ అధ్యక్షులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

కరకగూడెం: బీజేపీ పార్టీతోనే సువర్ణ పాలన సాధ్యమని ఆ పార్టీ మహబూబాబాద్ అభ్యర్థి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ పేర్కొన్నారు. శనివారం పార్టీ పినపాక మండల అధ్యక్షులు ధూళిపూడి శివప్రసాద్ అధ్యక్షతన పినపాక మండలంలోని జానంపేటలో గ్రామంలో బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. బూత్ అధ్యక్షులు ఎన్నికలకు సిద్ధం అవ్వాలని, పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా పార్టీ గెలుపు కోసం ఎలా పనిచేయాలో దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దంతులూరి రామచంద్ర రాజు, ప్రధాన కార్యదర్శులు పాటిబండ్ల శ్రీను, పొనగంటి రామకృష్ణ, రాష్ట్ర నాయకురాలు కృష్ణవేణి నాయక్ మండల కమిటీ బూత్ అధ్యక్షులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



వినాయకపురం పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న ఈఈ సురేష్ కుమార్

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పనులను మరింత వేగవంతం చేయాలని ఇరిగేషన్ ఈఈ సురేష్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని వినాయకపురం, నారాయణపురం, పేరాయిగూడెం గ్రామాల్లోగల ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు పైపులైన్ల పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు పునః ప్రారంభం నాటికి వంద శాతం పనులు పూర్తి చేయాలని అన్నారు. పనులను నాసిరకంగా చేస్తే బిల్లుల చెల్లింపులను నిలుపుదల చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈ కృష్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సీపీఎం సమావేశం

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న రామ సహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం జిల్లా నాయకుడు కొక్కెరపాటి పుల్లయ్య, ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఎం మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. యండ్రాతి అప్పారావు, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, కొప్పుల శ్రీను పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో పలు కాలనీలలో మిషన్ భగీరథ తాగు నీరు పైపులైన్ల లీకుల కారణంగా వృథాగా పోతున్నాయని వెంటనే మరమ్మతులు చేయించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకుడు తంబళ్ల కృష్ణారావు శనివారం ఓ ప్రకటనలో కోరారు. పట్టణంలోని చర్ల రోడ్డులోని డబుల్ బెడ్‌రూమ్‌లకు వెళ్లే దారితో పాటు బీఈడీ కళాశాల ఎదురుగా, మార్కెట్ యార్డ్ వద్ద పైపులు లీకులతో తాగు నీరు వృథాగా పోతోందని తెలిపారు.

‘గ్యారంటీలతో మోసం చేసిన కాంగ్రెస్’

కరకగూడెం: అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి రాగానే పథకాలను అమలు చేయకుండా పేద ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతరావు ధ్వజమెత్తారు.ఈ మేరకు ఆయన శనివారం కరకగూడెం, పినపాక మండలాల్లో ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన పార్లమెంట్ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. మహిళలకు నెలకు రూ.2500, రూ.15వేల రైతు భరోసా, 2లక్షల పంట రుణమాఫీ, వరికి 500 బోనస్ కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో నుంచి దిగిపోగానే కరెంటు కోతలు ప్రారంభమయ్యాయని, రైతు బంధు, కల్యాణ లక్ష్మి రావడం లేదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం 142 మెడికల్ కాలేజీలు దేశంలో మంజూరు చేసిన మన రాష్ట్రంలో ఒక మెడికల్ కాలేజ్ కూడా ఇవ్వలేదని, కానీ కేసీఆర్ కాలేజీలు తీసుకొచ్చారని అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు రేగా కాళిక, గుమ్మడి గాంధీ, పార్టీ పినపాక, కరకగూడెం మండలాల అధ్యక్షులు పగిడాల సతీష్ రెడ్డి, రావుల సోమయ్య, ఆత్మ చైర్మన్ భద్రయ్య, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ,సీనియర్ నాయకులు భవాని శంకర్, వాసు బాబు, ముక్కు వెంకటేశ్వర రెడ్డి, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



కరకగూడెం: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

మణుగూరురూరల్: జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో జరిగే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆవుల సర్వేశ్వరరావు, బానోత్ లక్ష్మణ్, కురం రవి, రామిరెడ్డి, మేరుగు రవీంద్రనాథ్, మహిళా మండల అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, జిల్లా కార్మికశాఖ అధ్యక్షురాలు వరలక్ష్మి, భాగం రవి పాల్గొన్నారు.

చంద్రుగొండ: జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం మార్గం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ర్యాలీ అగ్రభాగాన నిలవగా పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పరుగులు పెట్టారు. ర్యాలీలో నాయకులు భోజ్యానాయక్, సారేపలి శేఖర్, కొదుమూరి దయాకర్ రావు, కేశబోయిన నర్సింహారావు, యండి.అన్వర్, బుంగా శ్రీను, అంతటి రామకృష్ణ, యండి.ఇమ్రాన్, వసీం పాల్గొన్నారు.



చంద్రుగొండ: ఎమ్మెల్యే జారే ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కవితను ఎంపీగా గెలిపించాలి

మణుగూరురూరల్: బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మణుగూరు జెడ్పీటీసీ పోశం న ర్సింహారావు విజ్ఞప్తి చేశారు. శనివారం ఉపాధి హామీ పని ప్రదేశాల్లో ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమలు చేయలేని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మాలోత్ కవితను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూనవరం మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు మేకల రవి, వల్లభనేని రమణ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, వీరపనేని చెన్నకేశవులు, వీరన్నబాబు, శ్రీను, అర్జున్‌రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా ఫీవర్ సర్వే



కరకగూడెం: వైద్య శిబిరంలో వైద్యాధికారి, సిబ్బంది

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామ శివారు గొత్తికోయగూడెంలో శనివారం ముందస్తుగా ఫీవర్ సర్వే నిర్వహించారు. డాక్టర్ కనకం తనుజా ఆధ్వర్యంలో గొత్తికోయలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజ్ యండి.ఇమాం, సిబ్బంది శ్రీనివాస్, సుజాత, ఆశవర్కర్లు రాజేశ్వరి, విజయకుమారి, నాగమణి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: గిరిజన గ్రామాల్లో ఉండే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మలేరియా నిర్ధారణ పరీక్షలను చేయించుకోవాలని వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాందాస్, డాక్టర్ మధుశిక సూచించారు. శనివారం మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలోగల దురదపాడు, దిబ్బగూడెం గ్రామాల్లో 944 మందికి, గుమ్మడవల్లి పీహెచ్‌సీ పరిధిలోని కొత్త కావడిగుండ్ల గ్రామంలో 301 మందికి మలేరియా మాస్ స్క్రీనింగ్ సర్వేలో భాగంగా ఉచితంగా సామూహిక మలేరియా నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిపారు. కాగా మలేరియా నిర్ధారణ కాలేదని, ఈ పరీక్షలను ఆరు వైద్య బృందాల ఆధ్వర్యంలో చేపట్టినట్లు వైద్యాధికారులు తెలిపారు. సర్వేలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్ఈవో రాజు, సిబ్బంది శ్రీనివాస్, విజయ్‌రెడ్డి, రవి, ప్రసాద్, సతీష్, గోపాల్, సత్యనారాయణ, పీ వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మండలంలోని బుడుగుల, ఖమ్మం తొగు, బుగ్గ గ్రామాల్లో శనివారం ఫీవర్ సర్వే నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రక్తనమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ గోంది వెంకటేశ్వర్లు, సీహెచ్ఓ వెంకటేశ్వరరావు, ఎస్‌యూఓ లింగ్యా నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కరకగూడెం: ఆరోగ్యం పట్ల శ్రద్ధ ప్రతి ఒక్కరూ వహించాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గాభవాని సూచించారు.ఈ మేరకు ఆమె శనివారం పినపాక మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు.జ్వర లక్షణాలు ఉన్న 22 మందిని పరీక్షించగా వారిలో సాధారణ జ్వరం ఇద్దరికీ, మలేరియా ఒకరికి ఉన్నట్లుగా గుర్తించామన్నారు. మరో ఆరుగురు నుంచి రక్త నమూనాలు సేకరించామని తెలిపారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. శిబిరంలో స్థానిక సెక్రటరీ ప్రశాంతి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దే ఓటేశారు!

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల కమిషన్ ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించేలా ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. ఇంటి వద్దే ఓటింగ్ కార్యక్రమాన్ని శనివారం ఉదయం 7గంటల నుంచి ఓటింగ్‌ను ప్రారంభించగా.. సాయంత్రం 5గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ సాగింది.

అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, చంద్రుగొండ మండలాల్లో కలిపి 172 మంది ఇంటి వద్దే ఓటింగ్ ఎంపిక కాగా తొలి రోజు ఎన్నికల అధికారులు వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఓటు వేయించారు. ఓటింగ్ ప్రక్రియకు మొత్తం ఏడు బృందాలను ఏర్పాటు చేయగా తొలి రోజు 108 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని స్థానిక తహసీల్దార్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు నవీన్, కె.సందీప్, హరిత, లక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు దివ్యాంగులకు, వయోవృద్ధులకు అధికారులు నిర్వహించిన హోంఓటింగ్ శనివారం ప్రశాంతంగా సాగింది. హోంఓటింగ్‌కు మండలంలో మొత్తం 21 మంది దరఖాస్తు చేసుకోగా, తొలిరోజు 20 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సెక్టోరియాల్ అధికారి నరసింహారావు తెలిపారు. హోంఓటింగ్‌లో భాగంగా అధికారులకు ఇళ్ల వద్దకు వెళ్లి ఓటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వరరావు, సీహెచ్.భాస్కర్‌రావు, ఎస్.రవి, సురాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్..

భద్రాచలంఅర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకునే ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైంది. భద్రాచలం నియోజకవర్గ పరిధిలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తూ పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే 594 మంది అధికారులు శనివారం నుంచి మే 6వ తేదీన వరకు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శనివారం వివిధ శాఖలకు చెందిన 40 మంది అధికారులు ఓటు వేశారు.

దుమ్ముగూడెం: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారుల కోసం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దుమ్ముగూడెం మండల తహసీల్దార్ చంద్రశేఖర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



అన్నపురెడ్డిపల్లి: ఓటు వేస్తున్న వృద్ధుడు



దుమ్ముగూడెం: పోస్టల్ బ్యాలెట్ వేసిన దుమ్ముగూడెం తహసీల్దార్ చంద్రశేఖర్



అశ్వారావుపేట: ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు